క్లుప్తంగా

డీలర్లు సమయపాలన పాటించాలి

ముప్పాళ్ళ: డీలర్లు సమయపాలన పాటించి కార్డుదారులకు ఇబ్బంది లేకుండా సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ కె.నగేష్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్‌షాపుల నిర్వాహకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. డెప్యూటీ తహసీల్దార్ బాలవెంకటేష్, డీలర్లు పాల్గొన్నారు.

బిషప్ సత్యకిరణ్‌కు జాషువా పురస్కారం



సత్తెనపల్లి: గుర్రం జాషువా జయంతి సందర్భంగా సాహిత్య రంగంలో చేస్తున్న సేవలను గుర్తించి పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన బిషప్ ముక్తిపూడి సత్య కిరణ్‌కు జాషువా పురస్కారం ప్రదానం చేశారు. విజయవాడ గాంధీనగర్ కొతాపూర్ణానందం కళావేదికలో ఆదివారం అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సత్యకిరణ్‌కు పురస్కారాన్ని విజయవాడ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ యూవీ రత్నం, జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ ఉషారాణి అందజేశారు.

సమాజ అభ్యున్నతికి తోడ్పడిన జాషువా

అమరావతి: సమాజ అభ్యున్నతికి తోడ్పడిన మహాకవి గుర్రం జాషువా అని సీపీఎం నేతలు కొనియాడారు. జాషువాకు ఆదివారం రాత్రి స్థానిక సీపీఎం కార్యాలయంలో ప్రజాసంఘాల ఆధ్వర్యాన నివాళులు అర్పించారు. పార్టీ మండల కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడుతూ జాషువా సామాజిక అంశాలను సునిశిత దృష్టితో పరిశీలించి సామాజిక కవికోకిలగా నిలిచాడన్నారు. దళిత సంఘ నాయకుడు, వైఎస్సార్ సీపీ నేత తోకల సూరిబాబు మాట్లాడుతూ యువత గుర్రం జాషువా బాటలో నడిచి సామాజిక అణిచివేతలపై నిలదీయాలన్నారు. కార్యక్రమంలో పెదకూరపాడు వైఎస్సార్ సీపీ వైద్యుల విభాగం అధ్యక్షుడు షేక్ షరీఫ్, టి.లక్ష్మణ్, బూసి వెంకటేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇరుకుపాలెంలో వైద్య శిబిరం

ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): ఇరుకుపాలెం గ్రామంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం సోమవారం జరిగింది. సత్తెనపల్లి ఐసీడీఎస్ సీడీపీఓ టి.శ్రీలత సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. పీహెచ్‌సీ వైద్యులు రమాదేవి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.జయలక్ష్మి, సీహెచ్‌ఓ దస్తగిరి, హెల్త్ సూపర్‌వైజర్లు పీటర్‌డేమియన్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎమ్‌లు పాల్గొన్నారు.

కట్టమూరులో శంకుస్థాపన

సత్తెనపల్లి: దసరా సందర్భంగా పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో సోమవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సత్తెనపల్లి మండలం కట్టమూరులో అభయాంజనేయస్వామి విగ్రహ శంకుస్థాపన మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని రఘురాంనగర్‌లోని తన కార్యాలయంలో సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేవారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొమ్మలపాటి శ్రీధర్ పాల్గొన్నారు.

వైద్యసేవలు బంద్

క్రోసూరు: పీహెచ్‌సీ వైద్యులు సోమవారం విధులు బహిష్కరించారు. మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో ముగ్గురు వైద్యులు డాక్టర్ గఫ్రూన్, డాక్టర్ సాధ్, డాక్టర్ సిరిచందనలు హాజరైనా ఓపీ చూడలేదు. అర్జంట్ కేసు ఒకటి పాము కరిచిన మహిళకు ఇంజెక్షన్ మాత్రం డాక్టర్ సాధ్ ఇచ్చారు. ఓపీకి 55 మంది హాజరు కాగా స్టాఫ్‌నర్సు రాజ్యలక్ష్మీ మందులిచ్చారు.

రహదారి అధ్వానం

నకరికల్లు, ఇనిమెట్ల రోడ్డుకు మోక్షమెప్పుడో!



గోతులమయంగా నకరికల్లు, ఇనిమెట్ల గ్రామాల మధ్య రహదారి

నకరికల్లు: రహదారి అధ్వానంగా మారడంతో అవస్థల ప్రయాణం తప్పడం లేదు. పాలకుల హడావుడి మాటల్లో తప్ప చేతల్లో కానరావడం లేదనడానికి నిదర్శనం రహదారులే. గోతులు లేని రోడ్లు చేస్తామంటూ ఆర్భాటపు ప్రకటనలతో సరిపెట్టారేగానీ.. చేతల్లో చురుకుదనం లేదు. దీనికి తార్కాణం అడుగడుగునా గోతులతో తారసపడే నకరికల్లు-ఇనిమెట్ల రహదారే. నకరికల్లు నుంచి రాజుపాలెం మండలంలోని ఇనిమెట్ల, ఉప్పలపాడు గ్రామాల మీదుగా ఉన్నరోడ్డు రెడ్డిగూడెం వద్ద గుంటూరు-మాచర్ల రహదారిని కలుస్తుంది. అక్కడి నుంచి సత్తెనపల్లి, పిడుగురాళ్ల చేరుకోవచ్చు. నియోజకవర్గ కేంద్రం సత్తెనపల్లి చేరుకునేందుకు నకరికల్లు మండలంలోని వారికి తక్కువ దూరంగా ఉండటంతో ఈ రోడ్డు మీదగా ఎక్కువమంది రాకపోకలు సాగిస్తారు. ప్రసుత్తం ఈ రహదారి గోతులమయంగా మారి ప్రయాణానికి ప్రతికూలంగా మారింది.

అడుగడుగునా గోతులే

నకరికల్లు నుంచి రాజుపాలెం మండలం ఇనిమెట్ల వరకు కేవలం సుమారు నాలుగు కిలోమీటర్ల వరకు దూరం ఉంటుంది. ఈ దూరంలో అడుగడుగునా గోతులే. వర్షాకాలం కావడంతో గోతుల్లో నీళ్ల నిలిచి రోడ్లు కనిపించడం లేదు. వీటి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గోతులు లేనిచోట రోడ్డంతా కంకర తేలి ప్రమాదకరంగా మారింది. ద్విచక్ర వాహనచోదకులు ప్రయాణం చేసే క్రమంలో గోతులతో, కంకరుతోతరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

వారిలో స్పందనే లేదు

మండలకేంద్రం నకరికల్లు నుంచి నియోజకవర్గ కేంద్రం సత్తెనపల్లి వెళ్లే రహదారి గోతులమయంగా ఉన్న అధికారులుగానీ కూటమి ప్రభుత్వంగానీ పట్టించుకోవడం లేదు. కూటమి అధికారం చేపట్టి ఏడాదిన్నర కావస్తున్నా... రోడ్డుకు మరమ్మతులు కానీ కొత్తరోడ్డు నిర్మాణం కానీ చేపట్టిన దాఖలాలు లేవు. రోడ్లను అద్దాల్లా తీర్చిదిద్దుతామని మాటిచ్చిన కూటమి ప్రభుత్వం మాట తప్పడంతో ప్రయాణికులు, వాహనాచోదకులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



కంకర లేచి అధ్వానంగా రోడ్డు



గోతుల్లో నిలిచిన నీరు

అన్ని విభాగాల్లో అవినీతి!

- సత్తెనపల్లి మున్సిపల్ సమావేశంలో ధ్వజమెత్తిన కూటమి కౌన్సిలర్లు
- మెప్మా విభాగంలో పైసలు ఇవ్వనిదే పని కావడం లేదు
- సీఆర్‌డీఏ మాస్టర్‌ప్లాన్ సమావేశానికి కౌన్సిలర్ల అవసరం లేదా!





సమావేశంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు (ఇన్‌సెట్) మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి

సత్తెనపల్లి: మున్సిపాలిటీలోని అన్ని విభాగాల్లో అవినీతి జరుగుతోంది .. ప్రజా ప్రతినిధులకు కనీస సమాచారం ఇవ్వడం లేదంటూ కూటమి కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం జరిగింది. 6వ వార్డు కౌన్సిలర్ సదనం సత్యవాణి మాట్లాడుతూ ఈ నెల 27న మున్సిపల్ కార్యాలయంలో సీఆర్‌డీఏ అధికారులు మాస్టర్ ప్లాన్ పై నిర్వహించిన సమావేశానికి పట్టణంలో 31 మంది కౌన్సిలర్లు ఉంటే ఎవరికీ తెలపకుండా రియల్ ఎస్టేట్ బ్రోకర్లు, అక్రమ లేఅవుట్లు వేసే వ్యాపారస్తులతో ఎలా సమావేశం నిర్వహించారని ప్రశ్నించారు. మాస్టర్‌ప్లాన్‌లో ప్రజాప్రతినిధుల ప్రమేయం లేకుండా ఎలా నిర్వహిస్తారని మండిపడ్డారు.

పని చేయని 'పట్టణ ప్రణాళిక'

పట్టణ ప్రణాళిక విభాగం సరిగా పని చేయకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు నాగన్న కుంట, 5, 6 వార్డులు ముంపునకు గురయ్యాయన్నారు. మెప్మా విభాగంలో సీఓ శ్రీలక్ష్మి ఒక్కో లోన్‌కి రూ. 5 వేలు చొప్పున లంచాలు అడుగుతున్నారని, బ్యాంకు ఖాతా మార్పటానికి రూ. 500 ఇవ్వాలని పీడిస్తున్నారని ఆరోపించారు. స్త్రీ శక్తి సమావేశానికి ఒక వార్డ్ నుంచి 300 మంది మహిళలను పిలిచి మహిళా కౌన్సిలర్‌కి తెలియపరచలేదని, అధికారులు ఈ విషయంలో సిగ్గుపడాలన్నారు. కమిషనర్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ సీఆర్‌డీఏ సమావేశానికి తెలియ చేయకపోవడం పొరపాటేనని, మరోసారి కచ్చితంగా తెలియ పరుస్తామని సమాధానమిచ్చారు.

చైర్‌పర్సన్ లేకుండా సీఆర్‌డీఏ సమావేశమా!

మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ తురకామేరీగ్రేస్ మాట్లాడుతూ సీఆర్‌డీఏ అధికారులు మాస్టర్‌ప్లాన్ పై నిర్వహించిన సమావేశానికి కనీసం మున్సిపల్ చైర్‌పర్సన్ లేకుండా నిర్వహించి అవమానించారన్నారు. చైర్‌పర్సన్ లేకపోవడం అన్యాయమన్నారు. మెప్మా విభాగంలో విచ్చలు విడిగా లంచాలకు అలవాటు పడ్డారన్నారు.

ఆర్పీల అవినీతిపై చర్యలు తీసుకోండి

మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావునాయక్ మాట్లాడుతూ మెప్మా విభాగం లో ఆర్పీలు రూ. లక్షకు రూ. 5 వేలు చొప్పున కమిషన్ తీసుకుంటున్నారని, తీర్మానం రాయడానికి రూ. 1000 తీసుకుంటున్నారన్నారు. ఆర్పీలు రూ. లక్షల్లో సంపాదిస్తున్నారని, వారి అవినీతిపై చర్యలు తీసుకోవాలన్నారు. 16వ వార్డు కౌన్సిలర్ కంభంపాటి అబ్రహం కూడా మెప్మాలో అవినీతి విషయంలో ఏకీభవించారు.

ప్రజాప్రతినిధులంటే గౌరవం లేదా

డిప్యూటీ ఫ్లోర్ లీడర్ రంగిశెట్టి సుమన్ కుమార్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు అంటే అధికారులకు కనీస గౌరవం లేదన్నారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చెప్పినా ఐదు నెలల నుంచి సచివాలయ ఉద్యోగులతో సమావేశం కూడా నిర్వహించలేదన్నారు. పట్టణ ప్రణాళిక విభాగంలో రాజ్యాంగేతర శక్తి హవా నడుస్తుందని ఆరోపించారు. కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే వారితో లాలూచీ పడి ఆదాయం వనరుగా మార్చు కుంటున్నారని విమర్శించారు.

అందుబాటులో ఉండని సచివాలయ ఉద్యోగులు

20వ వార్డు కౌన్సిలర్ కూకుట్ల లక్ష్మి మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉండటం లేదన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ సక్రమంగా చేయడం లేదని, ఇప్పటివరకు తమ వార్డులో కార్డుల పంపిణీ ప్రక్రియ పూర్తి కాలేదన్నారు. 19వ వార్డు కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఆర్‌డీఏ అధికారులు మాస్టర్ ప్లాన్ పై నిర్వహించిన సమావేశానికి ప్రజా ప్రతినిధులను ఆహ్వానించకపోవడం సరైనది కాదన్నారు. 4వ వార్డ్ కౌన్సిలర్ కటకం రామకృష్ణ మాట్లాడారు. సమావేశంలో అజెండాలోని అంశాలను ఆమోదించారు. సమావేశంలో కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు, తదితరులు పాల్గొన్నారు.

పాలిథిన్ విక్రయ దుకాణాలపై దాడులు



సత్తెనపల్లిలో పాలిథిన్ సామగ్రిని చూపుతూ మాట్లాడుతున్న కమిషనర్ ఆనంద్ కుమార్

సత్తెనపల్లి: పర్యావరణానికి హాని కలిగించే పాలిథిన్ విక్రయ దుకాణాలపై మున్సిపల్ కమిషనర్ నంబూరి ఆనందరావు నేతృత్వంలో అధికారులు సోమవారం పట్టణంలో దాడులు నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ ఉత్సవ్-2025లో పట్టణంలోని పలు వ్యాపార దుకాణాల్లో దాడులు చేసి 35 కేజీల పాలిథిన్ సామగ్రిని పట్టుకొని సీజ్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ అనేక అధ్యయనాల తర్వాత జీవి మనుగడ కొనసాగాలంటే పాలిథిన్‌ను పూర్తిగా నిషేధించాలన్నారు.

ప్రజలకు, వ్యాపార సంస్థల వారికి ఇప్పటికే పలు సూచనలు చేశామన్నారు. ముందుగా పురపాలక సంఘ కార్యాలయం నుంచి రాజీవ్‌గాంధీ కూరగాయల మార్కెట్ వరకు పాలిథిన్ వద్దు .. కాటన్ ముద్దు అనే నినాదంతో ర్యాలీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.విజయసారథి, శానిటరీ సెక్రటరీలు, శానిటరీ మేస్త్రిలు తదితరులు ఉన్నారు.

అందని యూరియా, అన్నదాత సుఖీభవ

క్రోసూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యుల ప్రశ్నల పరంపర



క్రోసూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలాగఫూర్, వైస్ ఎంపీపీ విప్పల

క్రోసూరు: మండలంలోని అన్ని సచివాయాల పరిధిలో యూరియా సరఫరా జరగలేదని, అన్నదాత సుఖీభవ కౌలుదారులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అసలు పడలేదన్న ప్రశ్నలతో సభ్యులు సర్వసభ్యసమావేశం జరిగింది. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ పి.కోటయ్య అధ్యక్షత వహించగా, జెడ్పీటీసీ షేక్ జమీలా గఫూర్ ఎంపీడీవోజి.శ్రీనివాసరావు గౌరవ అతిథులుగా హాజరయ్యారు. గుడిపాడు ఎంపీటీసీ సుల్తానా జానీబాషా మాట్లాడుతూ తమ ఆర్బీకేకు ఒకసారి కూడా యూరియా రాలేదని ప్రశ్నించారే.

బ్లాక్ మార్కెట్లో యూరియా

వైస్ ఎంపీపీ విప్పర్ల వెంకట్రామిరెడ్డి తమ పీసపాడు గ్రామంలో 1500 ఎకరాలు సాగులో ఉంటే 300 బస్తాలు మాత్రమే వచ్చాయని, అదే బ్లాక్ మార్కెట్‌లో దొరుకుతున్నాయని చెప్పారు. డ్వాక్రా గ్రూపులకు బ్యాంకులు ఇచ్చే రుణాలపై 14 శాతం వసూలు చేస్తున్నాయని, మహిళాగ్రూపులు (పొదుపు) దాచుకున్న డబ్బుకు 4శాతం మాత్రమే ఇస్తున్నారని సభకు తెలియపరిచారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతుభరోసాను కౌలుదారులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కూడా అందించారని, కానీ కూటమి ప్రభుత్వం కౌలుదారులకు ఆర్థిక సాయం అందించలేదన్నారు. దీనిపై వ్యవసాయ అధికారి వేణుగోపాల్ సమాధానం ఇస్తూ అన్ని ఆర్బీకేలకు దాదాపుగా ఒక్క విడత యూరియా పంపించినట్లు, గుడిపాడుకు రాలేదని, తప్పని సరిగా పంపిస్తామని చెప్పారు. యూరియా సమస్య పరిష్కారమవుతుందని చెప్పారు. అన్నదాత సుఖీభవ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల కౌలుదారులకు ఇచ్చే విధివిధానాలను ప్రభుత్వం ఖరారు చేయలేదని తెలిపారు. మిగతా శాఖల అధికారులు వారివారి శాఖల పనితీరు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బ్లాక్ బర్లీ పొగాకు పంట నిషేధం

మండల స్పెషల్ అధికారి మస్తానమ్మ



మాట్లాడుతున్న మస్తానమ్మ, పక్కన ఇతర అధికారులు

అచ్చంపేట: బ్లాక్ బర్లీ పొగాకును పూర్తిగా నిషేధించామని, ఎవరూ ఆ పంట వేయవద్దని మండల స్పెషల్‌ధికారి పి.మస్తానమ్మ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. బ్లాక్ బర్లీ పొగాకును పూర్తిగా నిషేధించడానికి మండల స్థాయి కమిటీని కలెక్టరు ఆదేశాల మేరకు వేయనున్నట్లు చెప్పారు. ఆ కమిటీకి తహసీల్దార్ చైర్మన్‌గా, మండల వ్యవసాయాధికారి కన్వీనర్‌గా, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, మెడికల్ ఆఫీసర్‌లు కమిటీలో ఉంటారన్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతు సేవా సిబ్బంది గ్రామాల్లో నల్ల బర్లీ సాగు లేకుండా చూస్తారన్నారు. ఒకవేళ ఇప్పటికే సాగు చేస్తున్నట్లయితే వెంటనే దున్నేయాలన్నారు. రైతులు బ్లాక్‌బర్లీ సాగుకు ప్రత్యామ్నాయంగా మినుము, కంది, పెసలు, చిరుధాన్యాలు వేసుకోవాలని ఏవో పి.వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ పి.శ్రీనివాసరావు, డీసీ చైర్మన్ పాపిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ఆర్థిక పరిస్థితి మెరుగు

సత్తెనపల్లి: జీఎస్టీ తగ్గింపుతో ప్రజల తలసరి ఆదాయం మెరుగుపడుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. సత్తెనపల్లిలో సోమవారం ఆయన పలు కిరాణా, మెడికల్, ఎలక్ట్రానిక్ పలు దుకాణాలను సందర్శించి వ్యాపారులు, వినియోగదారులతో మాట్లాడారు. జీఎస్టీ తగ్గింపు పై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. శ్రీధర్ మాట్లాడుతూ ఒక్కొక్క కుటుంబానికి నెలకి రూ. 3 వేల నుంచి రూ. 5 వేల వరకు లబ్ధి చేకూరుతుందన్నారు. తగ్గించిన జీఎస్టీ అమలుకు వ్యాపారులు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నేతలు దరూవూరి నాగేశ్వరరావు, పోతుగంటి రామకోటేశ్వరరావు, సయ్యద్ పెదకరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ నమస్తుభ్యం..



సత్తెనపల్లి వాసవీ మాత ఆలయంలో



సత్తెనపల్లి త్రిశక్తి దుర్గా పీఠంలో..



కొత్తపేట మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద



వడ్డవల్లి పెద్దబొడ్డు రాయి వద్ద..



సరస్వతీదేవిగా వాసవీమాత



అనంతవరం వెంకన్న ఆలయంలో

సత్తెనపల్లి: అమ్మా సరస్వతీ మాత మా పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి వారు చదువుల్లో మంచి ప్రతిభ చూపేలా మనసారా దీవించు తల్లి అంటూ భక్తులు చదువుల తల్లి సరస్వతీ మాతను ప్రార్థించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని దేవీ ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవారి జన్మతిథి మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని పిల్లలను గుడికి తీసుకెళ్లి తల్లిదండ్రులు ప్రత్యేక పూజలు చేయించారు. పట్టణంలోని శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి దేవస్థానం, త్రిశక్తిదుర్గాపీఠం, గుంటూరు రోడ్డులోని సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, వెంకటపతికాలనీలోని శ్రీలక్ష్మీ ప్రత్యంగిరా అమ్మవారిపీఠంలోశ్రీనీలంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారిని, మున్సిపల్ కార్యాలయ సమీపంలోని మేదరసంఘ రామాలయం వద్ద, వడ్డవల్లి పెద్ద బొడ్డురాయి సెంటర్‌లో, కొత్తపేట మహాలక్ష్మమ్మ చెట్టువద్ద, వడ్డవల్లి శ్రీరామాలయం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద అమ్మవారిని సర్వతీదేవిగా అలంకరించి పూజలు చేశారు. కొమెరపూడిలోని రేణుకా అంకమ్మ దేవాలయంలో, పెదమక్కెన గ్రామంలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో సరస్వతీదేవిగా అలంకరించి పూజలు చేశారు.

సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారి దర్శనం

బెల్లంకొండ: శ్రీ మహాలక్ష్మీ పీఠంలో అమ్మవారు సోమవారం సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. వేద పండితులు ఫణికుమార శర్మతో పాటుగా పలువురు పూజారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మూలా నక్షత్రం సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం, పుస్తక పూజలు చేశారు. అమ్మవారి పాదాల వద్ద పూజించిన కంకణాలు, పెన్నులను విద్యార్థులకు అందజేశారు.

క్రోసూరు: క్రోసూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారు సోమవారం సరస్వతీదేవీగా , అనంతవరం శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

అచ్చంపేట: సీతారామస్వామి దేవాలయంలో సీతాదేవిని ధనలక్ష్మిగా అలంకరించారు.

ముప్పాళ్ళ: లంకెలకూరపాడు శివాలయంలో అమ్మవారు సరస్వతీ అలంకారంలో దర్శనమిచ్చారు. కుందురువారిపాలెం వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



అచ్చంపేట సీతారామ స్వామి ఆలయంలో



లంకెల కూరపాడులో..

పారిశుద్ధ్య కార్మికులపై చిన్నచూపు తగదు



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

సత్తెనపల్లి: పట్టణాలను పరిశుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులపై కూటమి ప్రభుత్వం వివక్షతో వ్యవహరించడం తగదని మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వంగిపరపు చంద్రకళ అన్నారు. రాష్ట్రంలో ఇటీవల అనంతపురం, గుంటూరు నగరంలో జరిగిన ఘటనలు మొత్తం మున్సిపల్ కార్మికులను ఆందోళనకు గురి చేస్తున్నాయన్నారు. వీటిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా మస్టర్ పాయింట్లు మునిసిపల్ ఆఫీసుల వద్ద నిరసన కార్యక్రమాల పిలుపులో భాగంగా సత్తెనపల్లి పట్టణ మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ పట్టణ నాయకుడు జడ రాజకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ అనంతపురంలో ఇంజినీరింగ్ విభాగం వాటర్ సెక్షన్‌లో పని చేస్తున్న కార్మికుడు గౌరీశంకర్‌పై అధికారులు అక్రమ కేసు బనాయించడమే కాక ఉద్యోగం నుంచి తొలగించాలని ఫైల్ రెడీ చేసి పోలీస్ కేసు పెట్టేందుకు కుట్రపూరితంగా వ్యవహరించారన్నారు. వీటిని నిరసిస్తూ అనంతపురంలో యూనియన్ ఆధ్వర్యాన నిరసన కార్యక్రమాలు జరిగాయన్నారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య కార్మికురాలు పద్మపై జనసేన కార్పొరేటర్ దాడి చేయడమే కాక నీచంగా మాట్లాడటం, సభ్య సమాజం సిగ్గుపడేలా వ్యవహరించారన్నారు. మనం లౌకికదేశంలో ఉన్నామా... అరాచక పాలనలో ఉన్నామా... అర్థం కావట్లేదని, కార్మికులపై చిన్నచూపు తగదన్నారు. రెండు ఘటనలను నిరసిస్తూ సత్తెనపల్లి పట్టణం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపామన్నారు. ఇటువంటి ఘటన మళ్లీ జరిగితే మున్సిపల్ కార్మికులంతా ఏకమై ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ నేతలు పెద్ద వెంకయ్యస్వామి, రాజు, లచ్చమ్మ, డేవిడ్ రాజు, పిట్ట జాన్, తదితర కార్మికులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతం

అచ్చంపేట: తల్లిపాలు అమృతంలాంటివని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ పద్మ చెప్పారు. మొదటి మూడు రోజులు వచ్చే పాలను ముర్రు పాలు అంటారని, వాటిలో వ్యాధి నిరోధశక్తి, బిడ్డ ఎదగడానికి కావలసి శక్తి కలిగి ఉంటాయన్నారు. రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని పెదపాలెంలో సోమవారం జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని, వారికి విద్యాబుద్ధులు, ఆటపాటలు నేర్పించి ప్రాథమిక పాఠశాలలకు పంపుతామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ నెల్లూరి హరిబాబు, బాపిరాజు, చిన్నవెంకటయ్య, నల్లమోతు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.